బాధ్యత తెలియని తండ్రిపై అసహ్యంతో ఇల్లు విడిచి అతనేం చేశాడు?

ఏ.వి.జి.ఎస్ మూర్తి కథ

# పూర్ణ

పూర్ణ వీధి అరుగుమీద కూర్చుని ఆలోచిస్తున్నాడు దిగులుగా. ఆ పిల్లవాడి ముఖంలో ఏదో విలువైనది పోగొట్టుకుంటున్నానన్న నిరాశ, నిస్పృహలు ద్యోతకమవుతున్నాయి. తెలీని భయమేదో అతని లేత హృదయాన్ని ఆవహించి కలవరపరుస్తోంది. నీళ్ళు నిండిన అతని కళ్ళలో అంతులేని నైరాశ్యం తొంగిచూస్తోంది.

పూర్ణకి పదమూడేళ్ళ వయసుంటుంది. నీరసంగా, అర్భకంగా కనిపిస్తాడు. వయసుకు మించిన ఆలోచనవల్ల కావచ్చు, కృంగిపోయినట్టుకూడా కనిపిస్తాడు.

పిరుదులమీద చిరిగిన లాగుతో బడికి వెళ్ళనని మొరాయిస్తుంటే తల్లి నాలుగు బాది "వెళతావా.. లేదా" అంది. పసితనం నుండి దెబ్బలు తినడం అలవాటైపోయిన పూర్ణ వెళ్ళనంటే వెళ్ళనన్నాడు రోషంగా. కసిగా ఇంకో రెండు తన్ని బయటికి నెట్టింది తల్లి.

అరుగుమీద కూర్చుని నిశ్శబ్దంగా ఏడుస్తున్న కొడుకు ముఖాన్ని చూడనైనా చూడకుండా, తన చేతిలోవున్న బియ్యం సంచిని తీసుకెళ్ళి లోపల పెట్టమని పురమాయించాడు అప్పుడే వచ్చిన తండ్రి విశ్వనాథం తనూ అరుగుమీద చతికిలపడుతూ. ఆ బియ్యం సంచిని చూడగానే ఆకలి గుర్తుకొచ్చినట్టుందా పిల్లవాడికి! ఏడుపుని, రోషాన్ని కంట్రోల్ చేసుకుంటూ సంచీ తీసుకువెళ్ళి తల్లికి కనిపించేటట్టు పెట్టాడు. భర్త వచ్చాడని గ్రహించింది రాజమ్మ.

"ఏం మనిషో... ఏ పూటకాపూట తెచ్చుకోకపోతే నెలకొక్కసారి తెచ్చి పడేసు



కొకూడదూ... ఎక్కువ తింటారని భయం కాబోలు... ఛీఛీ... ఈ సంసారం చేయాలంటేనే అసహ్యం వేస్తోంది. ఒక్కటే పట్టించుకోదు. పిల్లలంతా గోలపెడుతున్నారు చిరిగిపోయిన బట్టలతో బడికెళ్ళమని. నాలుగురోజుల్నుండీ మజ్జిగ నీళ్ళు లేవు. ఆ పచ్చడి మెతుకులతో నోరు చుట్టుకొస్తోంది. అన్నింటికీ కరువే. వెధవ సంత... ఛీ... ఛీ...

వచ్చి ఏ లోకాన ఉన్నాడో కాని మా నాన్నని తిట్టుకోవలసి వస్తోంది. ఇటువంటి మొగుడ్ని కట్టబెట్టేవందుకు. హు...'' అంటూ చేతిలో ఉన్న పత్తుగిన్నెని కోపంగా నేలకేసి కొట్టింది రాజమ్మ.

''ఏం కూశావే మాయదారిముండా... ఏమే... నాకేం తక్కువే. మూడువేల కట్నానికి నేను కాబట్టి ఒప్పుకున్నానే నిన్ను కట్టుకోవడానికి. నేను కాబట్టి నిన్ను భరిస్తున్నానే. ఇంకోడైతే రెండోరోజే తన్ని తగలేసేవాడే...'' అంటూ లోపలికి వచ్చి భార్య జుట్టు పట్టుకుని, వీపు వంచి పిడిగుద్దులు గుద్దాడు విశ్వనాథం.

అలవాటైన ఆ వాతావరణం పూర్ణకి ఎటువంటి భయోద్వేగాన్ని కలిగించలేదు. అలా నిలబడి గుడ్లప్పగించి చూస్తున్నాడు.

రాజమ్మ ఎదురుతిరిగి భర్త చెయ్యి పట్టుకుని ''ఇదిగో... ఇకమీదట నా వంటిమీద చెయ్యి పడిందంటే మర్యాదగా ఉండదు. జాగ్రత్త...'' అంది నిప్పులు కురిపించే కళ్ళతో. మళ్ళీ కొట్టాడు తండ్రి. తల్లికూడా తిరిగి కొట్టిందతడ్ని. ఇద్దరూ భద్రశత్రువుల్లా కొట్టుకుంటున్నారు పెద్దగా అరుచుకుంటూ. ఇంతలో చెల్లెళ్ళూ, తమ్ముడూ వచ్చి ''అమ్మా... ఊర్కోవే... నాన్నా ఊర్కోనాన్నా!'' అంటూ బిగ్గరగా ఏడవసాగారు. పూర్ణకి మాత్రం ఏడుపు రాలేదు. తల్లిదండ్రులిద్దర్ని లోలోపలే అసహ్యించుకుంటూ, చటుక్కున ఏదో ఆలోచన వచ్చినట్టైై గూట్లో ఉన్న పుస్తకాలు తీసుకుని బయటికి వచ్చి అరుగుమీద కూర్చున్నాడు.

'చదువుకుని గొప్పవాడిని కావాలి... మంచి ఉద్యోగం చేయాలి. ఈ దరిద్రంనుండి బయటపడాలి...' అనుకుంటూ రాత్రింబవళ్ళు చదవడం మొదలుపెట్టాడు.

''మొండి మనిషి... సంపాదించిన ప్రతి పైసా బ్యాంక్‌లో వేసుకుని మురిసిపోతాడు. తను తినడు. పెళ్ళాం బిడ్డలకు పెట్టడు. ఉత్త పాచిబుద్ధి'' భర్తమీద ద్వేషంతో, అసహ్యంతో పిల్లలను కూడా సరిగా పట్టించుకోవడం మానేసింది రాజమ్మ.

ఏదో మొగుడు తెచ్చి పడేస్తే వేళకింత ఉడకేయడం, పిల్లలకింత పెట్టి తను తినడం ... ఏ పక్కింటి జానకో, పొరుగింటి మీనాక్షో కబుర్ల కాలక్షేపానికి పిలిస్తే వెళ్ళడం చేస్తుంటుంది రాజమ్మ.

మీనాక్షి భర్త నపుంసకుడు. ఎంత ఆస్తివున్నా పక్క సుఖం లేదని రాజమ్మ దగ్గర వాపోతుంటుందామె. ఆ మాటా, ఈ మాటా చెప్పి ఓదారుస్తుంటుంది రాజమ్మ. మీనాక్షి అభిమానంతో ఇంట్లో మిగిలిపోయిన అన్నం, పప్పు, ఇతర అనుపాకాలు అప్పుడప్పుడూ ఇస్తుంటుంది రాజమ్మకి. పిల్లలందరికీ పండగలాగే వుంటుంది మీనాక్షి ఏదైనా తినడానికి పంపిస్తే.

ఇక జానకి. ఆమె భర్త నెలలో ఇరవై రోజులు టూర్లమీదనే వుంటాడు. పైగా వేరే ఊళ్ళో ఆయనకో చిన్నిల్లు కూడా వుందని అనుకుంటారా వీధిలో. జానక్కి కూడా ఇద్దరాడపిల్లలు. రాజమ్మ కూతుళ్ళిద్దరూ జానకి ఇంటికిపోయి వాళ్ళ పిల్లలతో ఆడుకుంటూ వుంటారు. జానకిది ఉదార హృదయం. తన పిల్లలతో సమానంగా

చూసుకుంటుంది వాళ్ళిద్దర్నీ.

రాజమ్మంటే ఈ అమ్మలక్కలిద్దరికీ అత్యంత అభిమానం. పేదరికంలో మగ్గిపోతున్న ఆమె అంటే వారిద్దరికీ అమితమైన జాలి. ముగ్గురూ కలిసి సినిమాలకీ, షికార్లకీ వెళ్ళడంకూడా పరిపాటయిపోయింది. ఈ నేపథ్యంలో చెల్లెళ్ళు, తమ్ముడి చదువులు బొత్తిగా పాడైపోతున్నాయని గ్రహించాడు ఆ ఏడాదే ఇంటర్‌లోకి వచ్చిన పూర్ణ. తోబుట్టువుల్ని దగ్గర కూర్చోబెట్టుకుని చదివించాలని ఎంతగానో ప్రయత్నించేవాడు.

'ఏ హాల్లో ఏ సినిమా ఆడుతోంది, ఏ హీరోకి ఏ హీరోయిన్ అయితే బాగుంటుంది, జానకత్త వాళ్ళింట్లో చేసే వంటలెంత బాగుంటాయి...' అని చెల్లెళ్ళు, 'మీనాక్షత్త పక్కలో పడుకోబెట్టుకుని చెప్పే సినిమా కథలెంత బాగుంటాయి!' అనే ఆలోచనతో పదిహేనేళ్ళ తమ్ముడు పూర్ణని ఏమాత్రం పట్టించుకునేవాళ్ళు కాదు. వాళ్ళకి పూర్ణ ఓ బడుద్ధాయిలా, దద్దమ్మలా కనిపించేవాడు. 'మాకు చదువంటే ఇంట్రెస్ట్ లేదు, పొమ్మనేవాళ్ళు.

* * *

పూర్ణ కాలేజీకి వెళ్ళాలంటే ఇంటినుండి నాలుగుమైళ్ళు నడవాలి. పోను నాలుగుమైళ్ళు, రాను నాలుగుమైళ్ళు నడవడం చాలా కష్టంగా అనిపించేదతనికి. అయినా తప్పేది కాదు. సిటీబస్ చార్జీలకి డబ్బులడిగితే ''నడిచి వెళ్ళి చదువుకో... లేకపోతే మానెయ్...'' అని కర్కశంగా, కఠినంగా చెప్పేవాడు తండ్రి. కాలేజీ ఫీజు కట్టమంటే గోలే... ఒక పుస్తకం కొనమన్నా గోలే... ఒక చొక్కాగుడ్డ కొనిపెట్టమన్నా గోలే' సంపాదించిందంతా ఏం చేస్తున్నావంటే నాలుగుబాది 'మీ అందర్నీ మేపడానికే చాలటం లేద'నేవాడు. తండ్రితో పోట్లాడి, పోట్లాడి తన్నులు తినీతినీ ఆయనమీద విపరీతమైన వైముఖ్యాన్ని పెంచుకున్నాడు పూర్ణ. ఈవినింగ్ షిఫ్ట్‌లో ఒక షాప్‌లో లెక్కలు వ్రాసే



## బిజీ...

మంకీపాండేకి పెద్దగా ఆఫర్స్ లేవు. ఈ విషయం బయటపడి... తనకి మార్కెట్ లేదని తెలిసిపోతే 'గర్ల్ ఫ్రెండ్' జారుకుంటుందని... మంకీ తెలివిగా...

ప్రతిరోజూ తన వీడియో లైబ్రరీకి వెళ్ళి అక్కడనుంచి 'గర్ల్ ఫ్రెండ్'కి ఫోన్ చేసి 'షూటింగ్ బిజీలో ఉన్నాను. రాత్రి లేటు అవుతుంది. వస్తూ కేసెట్లు తెస్తా... చూద్దాం' అని చెప్పడం మొదలుపెట్టాడు ఈ మధ్య.

పూర్ గర్ల్స్... మంకీ... బిజీ అని, అతను తెచ్చేవి అతడి ఫిల్మ్స్ అని అనుకుంటున్నారు.

—వి.జగదీవ్

పనికి కుదిరి నెలకు నలభై రూపాయలు సంపాదిస్తూ, ఆ డబ్బుతో కాలేజీ ఫీజు కట్టుకునేవాడు.

ఆరోజు ఉదయం భోజనం చేయకుండా కాలేజీకి వచ్చినందువల్ల మధ్యాహ్నమయ్యేసరికి అతనికి బాగా ఆకలేసింది. క్లాస్‌లో మనసు నిలపలేకపోయాడు. ఓ ఫ్రెండ్ నడిగి రూపాయి తీసుకుని క్యాంటీన్‌లో రెండిడ్లీ తిన్నాడు. ఆ కాస్త ఆకలి తీరుస్తుందా? ఆ తరువాత ఒక్క పీరియడ్ ఎలాగో ఉన్నాడు కానీ ఇకపైన ఆకలి బాధకి నిలవలేకపోయాడు. ఇంకో అబ్బాయి దగ్గర ఓ అర్ధరూపాయి తీసుకుని సిటీబస్సెక్కి ఇంటికి వచ్చేశాడు. ఇంటికి ఉన్న తాళం కప్ప పూర్ణని వెక్కిరించింది. మీనాక్షత్త వాళ్ళింట్లో తాళం చెవి ఏమన్నా ఇచ్చారేమోనని వెళ్ళి తలుపు తట్టాడు. ఒంటిమీద చొక్కా లేకుండా వచ్చి తలుపు తీసిన తమ్ముడ్ని చూసి నివ్వెరపోయాడు పూర్ణ.

"అమ్మావాళ్ళు సినిమాకెళ్ళారు... ఇదిగో తాళం చెవి..." అంటూ అందించాడు.

"నువ్వేం చేస్తున్నావు ఇక్కడ?" చెమటతో నిండిపోయిన తమ్ముడి ముఖాన్ని పరిశీలనగా చూస్తూ అడిగాడు పూర్ణ.

"మీనాక్షత్తతో కేరమ్స్ ఆడుకుంటున్నాను. ఇంక నువ్వెళ్ళు..." అంటూ ధడాలున తలుపేసి లోపలికి వెళ్ళిపోయాడు. ఆలోచించడానికూడా ఓపిక లేనట్లు తాళం తీసి లోపలపడ్డాడు పూర్ణ. ఆకలి, అలసటతో ప్రాణం పోతున్నట్టుగా ఉందతనికి. గబగబా వంటగదిలోకి వెళ్ళి కంచంనిండా అన్నం పెట్టుకుని ఉప్పు చింతకాయ పచ్చడి వేసుకొని ఆబగా, ఆరాటంగా, ఆత్రంగా తినసాగాడు. ఆకలి బాధ తీరింది. ఎందుకో తన పరిస్థితికి తన మీద తనకే జాలి కలిగింది పూర్ణకి. కుక్కి మంచం వాల్చుకుని అలాగే ఏడుస్తూ పడుకున్నాడు కాసేపు. ఫ్రెండ్ సర్కిల్ కూడా తక్కువ పూర్ణకి. విపరీతమైన వంటరితనంతో, ఆలోచనలతో నిత్యం బాధపడుతుంటాడు. అమ్మ పట్టించుకోదు. నాన్నకసలే పట్టదు. మనసు విప్పి మాట్లాడుకుందామంటే తోడులేని దౌర్భాగ్యం. వర్తమానం నిరాశాజనకంగానూ, భవిష్యత్ భయంకరంగానూ అనిపిస్తోందతనికి. కుమిలి కుమిలి ఏడ్చాడు. అటువంటి రోజులెన్నో అతని విషాదమయ జీవితంలో.

అలా ఏడుస్తూనే మధ్యలో లేచి కూర్చుని అర్ధరాత్రీ, అపరాత్రీ అని లేకుండా పుస్తకాలు ముందేసుకుని కూర్చునేవాడు ఒక్కోసారి. కళ్ళు మూతలుపడేదాకా చదివీ చదివీ ఎప్పటికో పడుకునేవాడు.

పూర్ణకి సీనియర్ ఇంటర్ పరీక్షలు రాసిన తరువాత టైఫాయిడ్ వచ్చింది. భర్తకి చెప్పి హాస్పిటల్‌కి తీసుకువెళ్ళమంది రాజమ్మ. నువ్వే తీసుకెళ్ళమన్నాడు అతను. మళ్ళీ ఇద్దరికీ పెద్ద యుద్ధం.

"అసమర్ధుడు పెళ్ళి చేసుకోవడమే పెద్ద తప్పు... చేసుకున్నా పిల్లల్ని కనడం మరీ తప్పు" అంటూ లేచిందామె.

"నన్నసమర్ధుడంటావుటే లం..." అంటూ కర్రపట్టుకొచ్చి కొట్టసాగాడు విశ్వనాథం. కూతుళ్ళొచ్చి అడ్డం పడ్డారు.

"ఇంకేం అనమంటావ్. ఏం సుఖపె


ట్రాప్ నన్ను... నిన్ను చేసుకుని నా బ్రతుకు సర్వనాశనం చేసుకున్నా...''

అడ్డం వచ్చిన కూతుళ్ళని ఒక్క తోపు తోసి భార్యమీద పడి కొడుతూ నానా బీభత్సం సృష్టించాడు విశ్వనాథం. ఇరుగూ పొరుగూ ముక్కున వేలేసుకున్నారీ గోలకి.

''వీడికిదేం పోయేకాలం... పెళ్ళాం బిడ్డల్ని ఇలవా వేపుకు తింటున్నాడు...'' అనుకున్నారంతా.

ఏడుపులతో పెడబొబ్బలతో విశ్వనాథం నోటినుండి వచ్చే బండ బూతులతో ఎలాగో ఆ రాత్రి తెల్లారింది. ఆ మరునాడు పెళ్ళాం బిడ్డల్ని తిట్టుకుంటూనే పూర్ణని ఆసుపత్రికి తీసుకువెళ్ళి చూపించాడు విశ్వనాథం. పది హేనురోజులు హాస్పిటల్‌లో ఉంచాలన్నారు డాక్టరు. ఆ పదిహేనురోజుల్లో మూడొందల కు పైగా వదిలింది విశ్వనాథంకి. రోజూ పూర్ణని సాధించడమే ఇంత డబ్బు ఖర్చయిం దని. తరువాత పది రోజులకి ఇంటర్మీడియెట్ రిజల్ట్ వచ్చింది. కాలేజీ ఫస్ట్‌లో పాసై, స్టేట్ మెరిట్ స్కాలర్‌షిప్ సంపాదించాడు పూర్ణ. డిగ్రీ ఫస్టియర్ స్కాలర్‌షిప్‌లో ఓ మూడొందలు తీసి తనకిచ్చేదాకా ఊరుకోలే దు తండ్రి. బాధపడుతూనే ఇవ్వక తప్పలే దు పూర్ణకి. మిగిలింది సేవింగ్స్‌లో ఉంచి కాలేజీ ఫీజులకి వాడుకున్నాడు. రాజమ్మకూడా ఓ రెండొందలు రాబడదామని చూసింది. పూర్ణ ''చదువాగిపోతుంది... ఇవ్వనంటే ఇవ్వనన్నాడు''.

''తండ్రికి తగ్గ తనయుడివనిపించుకు న్నావు. ఎక్కడికిపోతాయి వెధవ బుద్ధులు... ఛీ... ఛీ...'' అంటూ కొడుకుని తిట్టిపోసిం దామె. ఊహ తెలిసినప్పటినుంచీ ప్రేమగా దగ్గరకు తీయని తల్లంటే అతనికెప్పుడూ సదభిప్రాయం లేదు. అందుకే ఆమె సాధింపును పెద్దగా పట్టించుకోలేదు. కష్ట మో, నిష్ఠూరమో భరించి ఎలాగో రెండేళ్ళ డిగ్రీ చదువు పూర్తయిందనిపించాడు. అప్ప టికే అతనిలో ఓ రకమైన నిస్పృహ ఆవరించి ంది. అశాంతితో అలమటించిపోయాడు.



ఏదైనా ఉద్యోగ ప్రయత్నం చేసుకోవడం మంచిదనిపించింది. పేపర్‌లోకనిపించిన ప్రతి పోస్టుకీ అప్లయ్ చేయసాగాడు. రోజులు గడుస్తున్నాయి. కానీ ఉద్యోగం వచ్చే సూచనలు మాత్రం కనిపించలేదు. క్లాసు పుస్తకాల మీద మనసు నిలవడం లేదు. 'అసలీ డిగ్రీ తను సవ్యంగా పూర్తిచేయగలడా!' అనిపిస్తోంది.

ఇంకో పదిరోజుల్లో ఫైనలియర్ పరీక్షలు మొదలవబోతున్నాయి. ప్రిపరేషన్ హాలిడేస్ కావడంతో ఇల్లు కదలకుండా కూర్చుని చదువుకుంటున్నాడు పూర్ణ.

ఉదయం ఎనిమిది గంటల సమయం. తల్లి గొంతు వినిపిస్తోంది.

"ఇదిగో... లీలా! పొయ్యి మీదికి, పొయ్యి కిందికీ ఏమీ లేవు. అన్నీ తెస్తేవే ఈ పూట వంట. ఏమీ పట్టకుండా కూర్చున్నాడు పేపర్ ముందేసుకుని..."

"అబ్బ... నాకు చెప్తావే... ఉన్నాడుగా పంచలో... ఆయనకే చెప్పు..." సీరియస్‌గా మీనక్షాత్త ఇచ్చిన సినిమా పత్రిక చదువుకుంటున్న రెండో కూతురు లీల చిరాగ్గా అంది.

"రెండ్రోజుల క్రితమేగా తెచ్చింది అప్పుడే అయిపోయాయా... సరిగ్గా వండుతున్నావా... పారేస్తున్నావా..." దూకుడుగా లోపలికి వచ్చి గుర్రుగా భార్యవంక చూస్తు అన్నాడు విశ్వనాథం.

"ఓయబ్బ... సంబడం... పారేయడానిక్కాడాను. ఇదిగో నన్నవసరంగా రెచ్చగొట్టొద్దు. చూసిచూసి వండుతుంటేనే ఆ మాత్రం వచ్చాయి సరుకులు. అందరూ కడుపునిండా సరిగ్గా తింటే నువ్వు తెచ్చిన సరుకులు ఒక్కరోజుకు చాలేవి కావు..."

"దొంగముండ... పంది తిన్నట్టు తింటూ తినడం లేదంటావేమిటే? మొన్నెప్పుడో బియ్యం వేసి వేరుశనక్కాయలు తీసుకున్నావుటగా... నీ ఇష్టం వచ్చినట్టు దుబారా చేస్తూ నేను సరిగ్గా తేవటం లేదంటావుటే. .. శనిముండ..."

"నోర్ముయ్... అసమర్థుడా..." రెచ్చిపోయింది రాజమ్మ.

"నన్ను నోర్ముయ్యమంటావుటే..." అంటూ మీదబడి కొట్టడం మొదలుపెట్టాడు విశ్వనాథం. పెరట్లో కూర్చుని చదువుకుంటున్న పూర్ణకి ఈ గొడవంతా వినిపిస్తూనే ఉంది. ఆవేశంగా లేచి వచ్చి తండ్రి పట్టునుండి తల్లిని విడిపించి తండ్రిని విసురుగా ఒక్క తోపు తోశాడు. తల్లి కుప్పలా కూలిపోయి రోదిస్తోంది.

"ఛీ... ఇంత వయసొచ్చి పెళ్ళాన్ని కొట్టడానికి నీకు సిగ్గుగా లేదు. నువ్వసలు మనిషివేనా?" జుగుప్స నిండిన కళ్ళతో చూస్తూ అన్నాడు.

"ఓహో... నువ్వుకూడా తయారయ్యావన్నమాట. నా తిండి తింటూ నన్నే ఎదిరిస్తావ్రటా... ఉండు. నీ అంతు చూస్తాను" అంటూ కత్తిపీట తీసి కొడుకుమీదికి విసిరాడు విశ్వనాథం. గభాలున కిందికి వంగి తప్పించుకున్నాడు పూర్ణ. కొట్టడానికి తన మీదిమీదికి వస్తున్న తండ్రిని మళ్ళీ ఒక్క తోపుతోసి— "హు... నువ్వుపెట్టే తిండి, ఆలుబిడ్డలకు అన్నపెట్టడం కూడా ఘనకార్యమనుకుంటున్నావేమో... నీ మొండితనం

గురించి, నువ్వు పెళ్ళాం బిడ్డల్ని పెట్టే హింసల గురించి ఊరు ఊరంతా కోడై కూస్తోంది... నీలాంటి బాధ్యతలేని మగాడ్ని కట్టుకున్నందుకు ఆవిడా... మీకు పుట్టిన నేరానికి మేము జీవచ్ఛవాల్లా రోజులు గడుపుతున్నాం... ఆ సంగతి తెలుసుకోముందు. పెళ్ళి చేసుకుని పిల్లల్ని కనగానే సరిగాదు. వాళ్ళ బాగోగుల గురించి కూడా కాస్త పట్టించుకోవాలి. పిల్లలు దారి తప్పిపోతే చివరికి నువ్వే ఏడుస్తావ్. ఇకనైనా వివేకంతో ఇంటిని చక్కదిద్దుకో. లేకపోతే చెట్టుకొకరు, పుట్టకొకరు అయిపోతారు చివరికి. బాధ్యతగా ప్రవర్తించి పెళ్ళాం పిల్లలకి చేయవలసిన కనీస న్యాయం చెయ్యి. అంతేగాని ఇలా ప్రతిదానికీ ఎగరటం, నోరు పారేసుకోవడం అలగాతనమనిపించుకుంటుంది....''

అంటూ తను చెప్పదలచుకున్న నాలుగు ముక్కలు సూటిగా చెప్పేశాడు పూర్ణ.

కొడుకు మాటల్లోని యధార్థాన్ని అవగతం చేసుకోలేకపోగా, 'తనకే ఎదురు చెప్పేటంత గొప్పవాడయ్యాడా వీడు' అనే అహంకారం విశ్వనాథాన్ని మరింత రెచ్చగొట్టింది.

''ఒరేయ్... నాకే ఎదురుచెప్తావ్రా.. రాస్కెల్... ముందు నా ఇంట్లోంచి బయటికి నడు. ముందు నా ఇంట్లోంచి బయటకు నడు...'' అంటూ పైపైకి వస్తున్న తండ్రిని మరింత అసహ్యించుకున్నాడు పూర్ణ. స్వభావరీత్యా సున్నితుడైన పూర్ణ అంతరంగం తీవ్రంగా గాయపడింది. ఇంకా ఇంట్లో ఉండబుద్ధి కాలేదు పూర్ణకి. తన పుస్తకాలు, బట్టలతో బయటికి వచ్చేశాడు. తల్లి వారించలేదు. తండ్రి లోకంలోని ద్వేషాన్నంతా కళ్ళల్లో నింపుకుని చూస్తున్నాడు వెళుతున్న పూర్ణని. మిగిలిన పిల్లలంతా ఆందోళనగా, భయంగా చూస్తున్నారా వాతావరణాన్ని.

పూర్ణ ఎన్నో ఆఫీసులు తిరిగాడు. ఎన్నో ఫ్యాక్టరీలకు వెళ్ళాడు. టైప్‌రైటింగ్, షార్ట్‌హాండ్, ఇత్యాది టెక్నికల్ క్వాలిఫికేషన్స్ లేకుండా ఈ రోజుల్లో ఉద్యోగాలు రావని



## వాడకూడదు

''హల్లో, హల్లో, ట్రంకాలు వగంలో కట్ చేశారేంటండీ''.
''సారీ లోక్‌సభ రద్దయిందని యిప్పుడే రేడియోలో చెప్పారు. ఈ ఫోను మీకు ఎం.పి.గా యిచ్చారు కదా. అంచేత మీరు దీన్ని యింక వాడకూడదు''.

— వి.వి. సీతారామ్‌దాస్ (గుంటూరు)

చెప్పి పంపేవారు అంతా. తను విశాల ప్రపంచమనుకొని వచ్చిన ఈ లోకం ఇంత ఇరుగ్గా ఉంటుందని పూర్ణ ఊహించనైనా ఊహించలేదు. తన చదువుతో సంబంధం లేని ఏవేవో పనులు చేస్తూ బడుగు జీవులతో సహ జీవనం చేయసాగాడు. సినిమా హాళ్ళల్లో టిక్కెట్లు అమ్మాడు. హోటళ్ళలో పిండి రుబ్బాడు, దినసరి వేతనంమీద సర్వర్‌గా చేశాడు. క్వారీ కార్మికులతో కలిసి రాళ్ళు కొట్టాడు. ఎంత చేసినా, ఎంతగా రెక్కలు ముక్కలు చేసుకున్నా, కొండలని పిండిచేసినా బడుగుజీవి బ్రతుకుయానం ముళ్ళమీదనే నడుస్తుందనే యధార్థం అతనికి సహజానుభూతమైంది.

కిటకిటలాడిపోయే జనంతో బస్సు వేగంగా ముందుకు దూసుకుపోతోంది. అసలే వేసవికాలం. దానికితోడు విపరీతమైన రద్దీ. ఒకళ్ళనొకళ్ళు తోసుకుంటూ, రాసుకుంటూ ఉన్న రాడ్స్‌ను పట్టుకుని నీరసంగా, నిస్సత్తువగా వ్రేలాడబడి ఉన్నారు కొందరు యువతీ యువకులు. ఆ ఉక్కపోతతో సీట్లో కూర్చున్న వాళ్ళకే ప్రాణం పోతున్నట్లుగా ఉంది. ఇక గంటల తరబడి నిలుచుని ప్రయాణం చేస్తున్న వాళ్ళ పరిస్థితి ఎంత దయనీయంగా ఉంటుందో వర్ణించశక్యమే కాదు. నిలబడి ఉన్న పూర్ణ భళ్ళున వాంతి చేసుకున్నాడు. అతనిముందు ఉన్నవాళ్ళంతా గోలగోలచేశారు. జుగుప్సతో ఆపాదమస్తకం కంపించిపోతూ నానా తిట్లూ తిట్టారతన్ని.

కళ్ళలో ప్రాణాలు నిలుపుకుని దీనంగా చూస్తున్న అతనివంక జాలిగా చూస్తూ ఎవరో పెద్దాయన "ఎందుకరా? అతన్నలా తిడతారు. పాపం బస్సు పడదు కాబోలు రా బాబూ నువ్విలా కూర్చో..." అంటూ తనులేచి పూర్ణని కూర్చోబెట్టాడు.

"నీమీద వాంతి చేసుకున్నట్లయితే నీకు తెలిసేది" ఖరాబైన షర్ట్‌ని కర్చీఫ్‌తో తుడుచుకుంటూ చిరగ్గా అన్నాడో నీటుగాడు.

మొత్తానికి ఎలాగైతేనేం గోల కాస్త సద్దుమణిగింది. సీట్లో కూర్చున్న పూర్ణ కృతజ్ఞతగా పెద్దాయనవంక ఓసారి చూసి కళ్ళు మూసుకున్నాడు. మూసుకున్న అతని కళ్ళల్లో ఏవేవో స్మృతులు. మనసు బాధగా మూలిగింది. ఆపుకోలేని హృదయావేదన కన్నీరై స్రవించింది.

చదువుకునే రోజుల్లో ఫ్యూచర్ గురించి ఎన్నెన్ని కలలు కన్నాడు తను! కలలన్నీ కల్లలుగానే మిగిలిపోయాయి. అసలు చిన్నప్పటినుంచీ చస్తూ బ్రతకటం అలవాటైపోయింది తనకు. కొంతమంది జీవితాలెందుకిలా శాపగ్రస్థంగా తయారౌతాయో? ఏం తిన్నాడో... ఏం కట్టుకున్నాడో తెలీకుండా పెరిగాడు. ఇరవైనాలుగ్గంటలూ చదువే లోకంగా ఉండేవాడు. ఒక సరదా లేదు. ఒక షికారూ లేదు. చిన్నచిన్న కోరికలను కూడా చంపేసుకుని భవిష్యత్‌మీద ఎన్ని ఆశలు పెట్టుకుని చదువుకున్నాడు. వేళకింత పచ్చడికూడు తప్పితే మరేమీ లేని ఇంట్లో కన్నపిల్లల బాగోగులు పట్టించుకోని తల్లిదండ్రుల పెంపకంలో చితికిపోయిన చిన్నతనం స్మృతిపథంలో మెదిలి అతని హృదయం ద్రవించింది.

పుట్టి బుద్దెరిగినప్పటినుంచీ కాస్త సుఖం కూడా నోచుకోని తనకెందుకో మమకారం ఈ జీవితమంటే?

తన ప్రయత్నాలు ఫలించి ఎప్పటికైనా 'ఈ పూటకి లేదు' అనుకోకుండా జీవిక సాగించగలడా తను.

ఎప్పటికి బాగుపడుతుంది తన జీవితం! అబ్బ.... ఈ మెంటల్ యాంగ్జయిటీని, టెన్షన్‌ని భరించలేకపోతున్నాను. ఈ గుండాగిపోతే బాగుందు...' అనుకున్నాదు వేదనగా.

ఈ బస్సు టిక్కెట్టు చార్జీకి తన డబ్బు సంపాదించిన వైనం గుర్తుకొచ్చిందతనికి. ఈ సారైనా ఉద్యోగం వస్తుందనే ఆశతో నిన్నటి రోజున క్రొత్తగా రిలీజైన 'ప్రేమలోకం' సినిమాహాలు దగ్గర బ్లాక్‌లో టిక్కెట్లమ్మి సంపాదించిన డబ్బుతో పరీక్ష రాయడానికి ఇలా బయల్దేరాడు. ఇదే చివరి ఛాన్స్. సెంట్రల్ గవర్నమెంట్ ఎగ్జామ్స్ రాయడానికి... ఈ సారైనా వస్తే బాగుందు ఉద్యోగం. ఇప్పుడు టెస్ట్‌రాసి, ఆ రిజల్ట్ వచ్చేసరికి ఓ మూడు నెలలు పడుతుంది. ఇంటర్వ్యూ వచ్చి జాబ్ వచ్చేసరికి ఇంకో నాలుగైదు నెలలు పడుతుంది. అంతవరకూ తను బతికి ఉండగలడా అసలు...?

బస్సు గమ్యస్థానానికి చేర్చింది.

పద్మవ్యూహంనుంచి బయటపడ్డ అభిమన్యుల్లా అందరూ బిలబిలా బస్సునుండి దిగసాగారు. లేని ఓపిక తెచ్చుకుని మెల్లిగా అడుగులు వేస్తూ నేలపై కాలుమోపాదు పూర్ణ.

మధ్యందిన మార్తాండుని తీవ్ర చండ ప్రతాపానికి సెగలు పొగలై తడిసి ముద్దయిన శరీరాలతో పరీక్ష రాయడానికి వచ్చిన యువతీ యువకులంతా తమతమ ఎగ్జామినేషన్ సెంటర్స్‌కి వెళ్ళటానికి సిటీ బస్సులకోసం వెయిట్ చేస్తూ నిలబడ్డారు.

పూర్ణకి కావలిసిన సిటీబస్సు వెంటనే దొరికింది. ఓ దీర్ఘనిశ్వాసాన్ని విడిచి, నీరసంగా కదిలివెళ్ళి మళ్ళీ బస్సెక్కాడు. సెంటర్‌కి చాలా దగ్గరలోనే ఆగింది బస్సు. చుట్టుపక్కల తనకు తగిన హోటల్ ఏదైనా



# లాఫో(టో)న్

'మహానాగ్ టెలిఫోన్ నిగమ్ లిమిటెడ్' ఆపరేటర్స్‌కి తరచుగా ఖాట్మండులో మనీషా కొయిరాలా... ఇంటికి కనెక్షన్ ఇవ్వవలసి వస్తోంది.

మనీషా ఒక్కత్తే ఇంట్లో ఉండటంతో... స్వయంగా ఫోను ఎత్తుతోంది... "ఐ లవ్ యూ... ఐ లవ్ యూ" అంటూ ప్రతిసారీ ఫోనులో మాట్లాడుతోంటే... ఓపిగ్గా వినడంతప్ప శపీమని రిసీవర్ పెట్టెయ్యలేకపోతోంది కొయిరాలా.

ఎలా పెడుతుంది... అవతల వ్యక్తి సుభాష్... అయితే...

—వాణీకృష్ణ

ఉంటుందేమోనని దృక్కులు సారించాడు పూర్ణ. అన్నీ ఖరీదైన రెస్టారెంట్స్, బార్స్, షాప్స్ కనిపిస్తున్నాయి తప్పితే ఎక్కడా తవకి తగిన హోటల్ కనిపించలేదు. నిరాశగా కాళ్ళీడుస్తూ నడవసాగాడు. ఎదురుగా ఉన్న ఓ షాప్‌లో వాల్‌క్లాక్ చూశాడు. టైమ్ పన్నెండు దాటుతోంది. పరీక్ష ఒంటిగంటకి. 'ఫర్వాలేదు... ఇంకో గంట టైముంది' అనుకుని ఆ ప్రాంతంలో ఉన్న సందులన్నీ తిరగసాగాడు. అతని శ్రమ ఫలించి ఓ చిన్న పాక హోటల్ కనిపించింది. బయట కర్రకు తగిలించి ఉన్న రేకుమీద 'కాఫీ, ఫలహారశాల' అని రాయబడి ఉంది. ప్రాణం లేచి వచ్చినట్లయిందతనికి. ఎవరో టిఫిన్ తిని బయట చెయ్యి కడుక్కుంటున్నారు. మెల్లిగా వెళ్ళి ఓ బల్లమీద చతికిలబడ్డాడు.

"బాబూ... పూర్ణా!" అవే పిలుపు వినిపించి దిగ్గున తలతిప్పి చూశాడు పూర్ణ. సంభ్రమాశ్చర్యాలతో తనవంకే చూస్తున్న తండ్రిని విరసనగా చూసి తల తిప్పుకున్నాడు పూర్ణ.

"ఏం కావాలి?" బికారిలా ఉన్న పూర్ణని ఎగాదిగా చూస్తూ ప్రశ్నించాడు ఆ పాక హోటల్ యజమాని. తన వాలకం చూస్తే 'డబ్బులిస్తాడో, లేదోనని అనుమానంగా ఉన్నట్లుంది వీడికి?' అనుకొని పేలవంగా నవ్వుకుని అడిగాడు. "ఇడ్లీ వుందా?" అని నూతిలోంచి వచ్చినట్లుగా ఉందతని స్వరం.

ఓ సత్తుప్లేట్లో నాలుగిడ్లీ, ఇంత కారప్పొడుం వేసి తెచ్చిచ్చాడు అతను. ఆవురావురుమంటూ తిని ఇంకో నాలుగిడ్లీ వేయమన్నాడు పూర్ణ. "అయ్యో లేవు బాబూ... మీ కోసమే అన్నట్లుగా ఆ నాలుగిడ్లీ మిగిలాయి. అంతే... పోనీ ఉప్మా వేయమంటారా?" అడిగాడతను. ఏదో ఒకటి వేయమన్నాడు. విశ్వనాథం కొడుకువంక జాలిగా, బాధగా చూస్తూ. అదేమీ పట్టించుకునే స్థితిలో లేదు పూర్ణ. ఆ కాస్త ఉప్మా కూడా తినేసి, రెండు మూడు గ్లాసులు గటగటా నీళ్ళు పట్టించాడు కడుపునిండా. కాస్త ఓపిక వచ్చినట్లయిందతనికి. ఇంకొంచెం నీళ్ళు తీసుకుని ముఖం కడుక్కున్నాడు. హాయిగా అనిపించింది.

"ఎంతైంది బిల్లు?" జేబులోనుండి ఐదు రూపాయల నోటు తీస్తూ అడిగాడు పూర్ణ. "ఆ అయ్యగారిచ్చారు బాబూ!" అంటూ విశ్వనాథం వైపు చూపించాడు ఆ హోటల్ యజమాని.

నొసలు చిట్లించిచూస్తూ "హు!" అని విసావిసా బయటికి నడిచాడు పూర్ణ.

"బాబూ... పూర్ణ! ఒరేయ్... నా మాట వినరా..." అంటూ వెంటబడ్డ తండ్రిని ఓసారి నిర్లక్ష్యంగా చూసి ముందుకు వెళ్ళిపోయాడు పూర్ణ.

కొన్నివందలమంది అభ్యర్థులకి ఎగ్జామినేషన్ సెంటర్‌గా ఇవ్వబడ్డ ఆ మూడంతస్థుల కాలేజీ బిల్డింగ్ గేటు ఇంకా తెరవలేదు. గేటు కానుకుని రెండువైపులావున్న ఎత్తయిన అరుగులమీద కొందరు, కాలేజీ ఎదురుగా ఉన్న వృక్షం నీడలో కొందరు, గేటుకంటుకుపోతూ వ్రేలాడబడిపోతున్న మరికొందరు — మేథమెటిక్స్‌గురించి, రీజనింగ్ గురించి, న్యూమరికల్ ఎబిలిటీస్ గురించి, డిస్క్రిప్టివ్ టెస్ట్ గురించి మాట్లాడుకుంటున్నారు.

నిరుద్యోగ సమరంలో శక్తివంచన లేకుండా పోరి, పోరి అలిసిపోయిన వారిలా ఉన్న కొందరు పరీక్ష గురించి ఉత్సాహంగా మాట్లాడుకుంటున్న వాళ్ళవంక చూస్తూ నిర్వేదంగా నవ్వుకుంటున్నారు.

చెట్టుకింద ఉన్న ఓ రాతిమీద చతికిలబడి అసహనంగా గేటువైపు చూస్తున్నాడు పూర్ణ.

సరిగ్గా ఒంటిగంటకి గేటు తెరిచారు. 'అమ్మయ్య' అని ఊపిరి పీల్చుకుని అందరూ నోటీస్‌బోర్డు దగ్గరకు వెళ్ళి తమ నెంబరున్న రూమ్ నెంబర్ చూసుకుని తమ తమ రూమ్స్ వెతుక్కుంటూ వెళ్ళారు.

పరీక్ష హాల్లో పేపరందుకునే వరకూ ఉన్న కాస్త ఓపికా క్షీణించిపోయింది పూర్ణకి. ఒళ్ళంతా తిప్పుతూ, కళ్ళు బైర్లు కమ్మసాగాయి. శరీరమంతా వెచ్చగా కాలిపోతోంది. తల పగిలిపోతోంది. ఎలాగో పరీక్ష రాశాననిపించి నలుగురితో పాటు బయటపడ్డాడు. దగ్గర్లో ఉన్న మెడికల్ షాప్‌లో క్రోసిన్ టాబ్లెట్స్ రెండు కొనుక్కొని ఒకటి వేసుకున్నాడు. సిటీబస్‌లో బస్టాండుకు వచ్చి తమ ఊరి బస్ కోసం వెయిట్ చేస్తూ ఓ బెంచిమీద కూర్చున్నాడు.

ఎవరో తననే తదేకంగా చూస్తున్నట్లనిపించడంతో తల పక్కకి తిప్పి చూశాడు పూర్ణ. వెంటనే అతని భృకుటి ముడిపడింది

ఇంకా తనని ఫాలో అవుతున్నాడా ఈయన! విశ్వనాథం కొడుక్కి దగ్గరగా జరిగి— "బాబూ... పూర్ణా! నేను చెప్పేది కాస్త విను..." వణికే కంఠంతో అన్నాడు. తండ్రివంక అసహ్యంగా చూశాడు పూర్ణ. ఆ చూపులకి తల్లడిల్లిపోయింది విశ్వనాథం వృద్ధ హృదయం. ఏదో చెప్పాలనే ఆరాటం, ఆత్రుత కళ్ళనిండా నింపుకుని దీనంగా కొడుకువంక చూస్తున్నాడు విశ్వనాథం. పూర్ణ మనస్సు ఏమాత్రం కరగలేదు. వచ్చేపోయే బస్సులను పరిశీలిస్తూ కూర్చున్నాడు అసహనంగా.



''బాబూ... అమ్మ ఆత్మహత్య చేసుకుం దిరా..'' అంటూ రెండు చేతుల్లో ముఖం కప్పుకుని బావురుమంటోన్న తండ్రివంక విచిత్రంగా చూశాడు పూర్ణ.

''పాపిష్టిముండలు...చెడు తిరుగుళ్ళు తి రిగి ఎవరో కులం కాని వెధవలతో లేచిపో యారు నీ చెల్లెళ్ళు.. వాడు ఆ పక్కింటి మీనాక్షిని గర్భవతిని చేసి దేశాలు పట్టిపోయా డు. నిండా ఇరవయ్యేళ్ళు లేవు. చూశావా ఎంత పని చేశాడో నీ తమ్ముడు!'' అంటూ ఉత్తరీయంతో ముఖాన్ని వత్తుకుంటున్న తం డ్రివంక విరసవగా చూస్తూ అన్నాడు పూర్ణ.
''నా తమ్ముడు... నా చెల్లెళ్ళు అంటున్నావ్. .. వాళ్ళంతా నీ కన్నబిడ్డలు కారా? ఎందుకలా వాళ్ళని తిడతావ్? ఆ ఇల్లు నాశనం కావడానికి కారణం నువ్వు కదూ... ఏనాడైనా కన్నపిల్లల ఆలనా, పాలనా చూసు కున్నావా... ఇంట్లో ఏదికావాలో, ఎవరెలా ప్రవర్తిస్తున్నారో అసలు పట్టించుకున్నావా? బ్రతికున్నంతకాలం చూసుకోవడం చేతకా లేదు కానీ ఆవిడ చచ్చిపోయిం తరువాత ఏడుస్తున్నావా!''
''అయితే తప్పంతా నాదేవంటావా...''

''ముమ్మాటికీ వీదే... నీ మొండి తనంతో ఇంటినో నరకం చేశావు. ఇంట్లో కనీసావసరాలు కూడా తీరని భార్యాపిల్లలు ఎన్ని ఇక్కట్ల పాలయ్యారో... నీ బాధ్యతా రాహిత్య ప్రవర్తనవల్ల వాళ్ళెలా చెడు నడతలు నడుస్తున్నారో గ్రహించలేకపోయావు. నీ మొండితనానికి, లోభత్వానికి పర్యవసానం చూశావా... ఎంత దారుణంగా ఉందో... ఆ రోజుల్లో అమ్మ అన్నట్లు నీలాంటి వాళ్ళు అసలు పెళ్ళిళ్ళు చేసుకోకూడదు. చేసుకు న్నా పిల్లల్ని కనకూడదు. నీలాంటి తండ్రుదు లున్న పిల్లలు ప్రతినిత్యం చస్తూ బ్రతుకుతా రు. అనునిత్యం బాధలతో, బ్రతుకు భయంతో శాపగ్రస్తమైన జీవితాలను గడుపు తారు. ఈ దేశంలో యువత నిర్వీర్యమై పెడత్రోవలు పట్టడానికి కారణం నీవంటి తండ్రులు కూడా...? నిరాశా నిస్పృహలను ఉగ్గుపాలతో పోసి పెంచబడతారు. నీలాంటి బాధ్యతలేని తండ్రుల పెంపకంలో పెరిగిన పిల్లలు... వృద్ధాప్యంలో ఉన్నావు కాబట్టి ఇప్పుడు నీకో తోడు కావలసి వచ్చింది. తల కొరివి పెట్టడానికి కూడా పనికి వస్తావని ముందుచూపుతో నా వెంటబడుతున్నావు. అంతేగాని నీకెవ్వరూ అక్కర్లేదసలు... డబ్బే పావనం నీకు...వెళ్ళు... నీ డబ్బుతోనే మనుషుల్ని కొనుక్కో... ఇంకెప్పుడూ నాకు కనిపించకు'' రుద్ధ కంఠంతో అన్నాడు పూర్ణ.

''పూర్ణా జరిగిందేదో జరిగిపోయింది. అదంతా మర్చిపో నాయనా... కూర్చుని తిన్నా తరగని ఆస్తివుంది మనకి. ఉద్యోగం లేకపోయినా ఫర్వాలేదు. హాయిగా పెళ్ళి చేసుకొని సుఖపడు. నా దగ్గరకు వచ్చేసెయ్. నీకేలోటు రానివ్వను'' అంటూ కొడుకు చేతులు పట్టుకుని అడిగాదు విశ్వనాథం.

ఇంతవరకూ తను చెప్పినదంతా వినికూ డా తండ్రి అలా మాట్లాడుతున్నందుకు చిరాకేసింది పూర్ణకి.

కేవలం ధన వ్యామోహంతో, మూఢత్వ ంతో ఒక నిండు సంసారాన్ని నాశనం చేసిన

తండ్రిగా ఆయన్ని క్షమించలేకపోతున్నాడు పూర్ణ. ఆయన కారణంగా అన్యాయమైపోయిన తల్లీ, చెల్లెళ్ళు, తమ్ముడు దీనంగా కళ్ళముందు నిలిచారు. ఎంతో విలువైన పసిడి బాల్యం, యౌవనం— అన్నీ ఈ ధనాశాపరుడైన తండ్రివల్ల ఎంతగా చితికి ఛిద్రమైపోయాయో విమర్శించుకుంటున్న పూర్ణకి ఆయనమీద చెప్పలేనంత ఏవగింపు కలిగింది. ఆయన నీడకూడా భరించలేనని చెప్పి ఇవతలకు వచ్చేశాడు. ఏదో తప్పుచేశానన్న అపరాధ భావన విశ్వనాథం అంతరంగాన్ని తొలుస్తోంది. బస్సెక్కి వెళ్ళిపోతున్న కొడుకు వంకే చూస్తూ బాధగా నిట్టూర్చాడు.

పూర్ణ తన ఊరు చేరుకునేసరికి రాత్రి పదయింది. జేబులో ముప్పై పైసలు మిగిలాయి. రిక్షా ఎక్కి గుడిసెకి పోదామనుకున్నా వీలుగాని పరిస్థితి. నీరసంతో ప్రాణం పోతున్నట్లుగా ఉంది. దాహంతో నాలుక పిడుచకట్టుకుపోతోంది. పావలాతో ఓ సోడా తాగి భారంగా కాళ్ళీడుస్తూ నడక సాగించాడు. దాదాపు సగం దూరం వచ్చాక ఏదో పాట వినిపించి చట్టున ఆగి చుట్టూ చూశాడు పూర్ణ.

నిర్మానుష్యమైన ఆ చీకటి ప్రాంతంలో ఓ ఆడపిల్ల కూనిరాగం! క్రమంగా ఆ స్వరం పెద్దదై పూర్ణకి సమీపంగా వినిపించింది. సుపరిచితమైన తీయని కంఠం. అదేపాట... అదే గొంతు... ఆ పాడేది తన చెల్లెలు లీల కదూ! ఇంట్లో ఎప్పుడూ పాడుకుంటూ వుండేది ఆ పాటని!

'చిన్నిమాట... ఒక చిన్నిమాట... సన్నజాజి పూచె... చల్లగాలి వీచె....' పాట దగ్గరై భుజంమీద చేయిపడేసరికి ఉలిక్కిపడ్డాడు పూర్ణ. "రేటు తక్కువే... రండి పోదాం..." అంటూ అతని చెయ్యి పట్టుకుందామె. వెంటనే ఆమె చెంప ఛెళ్ళుమంది. కళ్ళల్లో గిర్రున నీళ్ళు తిరిగాయి. గబగబా వెళ్ళబోయింది. పూర్ణ ఆమె జబ్బ పట్టి ఆపుతూ "లీలా!" అరిచాడు.



## రిఫండు

"మీరు గత ఎన్నికల్లో ఓటుకు ఆరవై రూపాయాలు యిచ్చిన మాట నిజమే. అయిదేళ్ళు పదవిలో ఉండాలనే ఓటువేశాము. ఇప్పుడు నల్లభై అయిదు రూపాయిలు వాపసు యిచ్చేయమంటే, ఎలా బాబూ"

"మరి నేను పదిహేను నెలలే పదవిలో ఉన్నాను కదటయ్యా".

— వి.వి. సీతారామ్‌దాస్ (గుంటూరు)

"నువ్వా...!" అందామె నివ్వెరబోతూ.

"అవును నేనే... నీ అన్నయ్యను... చివరికింత దిగజారిపోయావన్నమాట... ఈ బ్రతుకు బ్రతకటానికి నీకసహ్యంగా లేదూ...?"

"హు... అసహ్యం... ఎందుకూ... కూటికోసం కోటి విద్యలు... అందులో ఇది ఒకటి. పొదులు... నా దోవన నన్ను పోనీ..."

"లీలా... నాతో వచ్చేయమ్మా... కంటికి రెప్పలా చూసుకుంటాను నిన్ను"

రాబోయే వర్షానికి సంకేతాన్నిస్తూ ఉరుములు, మెరుపులు మొదలైనాయి. మెరుపుల వెలుతురులో అన్నా చెల్లెళ్ళిద్దరూ ఒకళ్ళనొకళ్ళు పరీక్షగా చూసుకున్నారు.

"కంటికి రెప్పలా చూసుకుంటావా.. ఏం పెట్టి!? నిన్ను చూస్తుంటేనే తెలుస్తోంది. నువ్వెంత దరిద్రంలో మగ్గుతున్నావో... తన దూరకంత లేదు కాని మెడకో డోలు' అన్నట్టు నేనుకూడా ఎందుకులే నీతో... నిన్ను నువ్వు ఉద్ధరించుకో చాలు.. నేను హాయిగానే బతుకుతున్నాను. తింటున్నాను, తాగుతున్నాను,తిరుగుతున్నాను వస్తా!" అంటూ చీకటిలో కలిసిపోయింది లీల.

జోరున కురిసే వర్షంలో కుప్పలా కూలిపోయి వెక్కివెక్కి ఏడ్చాడు పూర్ణ. అలా ఎంతసేపు ఉన్నాడో అతనికే తెలియదు. రిక్షా గంటల గణగణ చప్పుడు విని మెల్లగా లేచాడు. ఆకలి బాధతో పరాలు లుంగచుట్టుకు పోతున్నంత బాధ. నీరసంగా నిస్సత్తువగా ఉంది. అడుగులు తడబడుతున్నాయి. తాగినవాడిలా తూలిపోతూ, పడుతూ లేస్తూ అతి కష్టంమీద నడుస్తున్నాడు. కడుపులో సన్నని నొప్పి మొదలైంది. బాధతో, భయంతో మూలుగుతూ కాసేపటికి తన నివాసానికి చేరుకున్నాడు. అతి ప్రయత్నంమీద స్టౌ వెలిగించి ఓ గుప్పెడు బియ్యం వుంటే ఉడకేశాడు. మొన్నటి రోజున నూరి పెట్టుకున్న ఉల్లిపాయ కారం తీసి అన్నం ఉడికిన సత్తుగిన్నెలో వేసుకొని కలుపుకుతిన్నాడు. కారంతో కడుపు భగ్గుమంది.

"అబ్బా!" అని పొట్టమీద చేయి వేసుకొని నొక్కుకుంటూ వచ్చి చాపమీద పడుకున్నాడు బాధగా. అంతకంతకీ నొప్పి పెరిగింది. భళ్ళున వాంతి చేసుకున్నాడు. భరించలేని నొప్పితో విలవిల్లాడిపోయాడు. ఓ పది నిముషాల తర్వాత కాస్త తగ్గినట్లనిపించింది. మళ్ళీ ఏవేవో ఆలోచనలు. అంతరంగ మథనంలో అల్లల్లాడిపోతున్నాడు.

"జరిగిన ప్రతి అనర్థానికి నీ తండ్రిని తప్పుపట్టావ్... కాని నువ్వు చేసిందేమిటి? నిరాశా నిస్పృహలతో, చేతకానితనంతో నిండు జీవితాన్ని నాశనం చేసుకున్నావ్...!"

"బాగుపడటానికి నేను ప్రయత్నించలేదా?"

"లేదు... అలా ప్రయత్నిస్తే ఈనాడు నువ్విలా ఉండేవాడివి కాదు. నీలో చొరవ తక్కువ. ఉత్సాహం తక్కువ. ఆత్మవిశ్వాసం అసలే లేదు. నీకంటే దారిద్ర్యంలో పుట్టినవాళ్ళు కూడా స్వయం కృషితో కష్టపడి. పైకొచ్చినవాళ్ళున్నారు. వాళ్ళు పైకి రావడమే కాకుండా తోబుట్టువులని కూడా పైకితెచ్చుకున్నారు. నీకది చేతకాలేదు. నిరా

శా నిస్పృహలే ఊపిరిగా పెరిగావు. నీలోని లోపాలని కప్పిపుచ్చుకుని అన్ని తప్పులకి నీ తండ్రినే బాధ్యుడ్ని చేస్తున్నావ్..! ఇంట్లోంచి బయటికి వచ్చిన తరువాత ఈ ఏడేళ్ళలో నువ్వు సాధించిందేమిటి? ఇంకా నీ తోబుట్టువులే నయం... ఏదోవిధంగా బతికేస్తున్నారు. ఆ మాత్రం నీకు చేతకాలేకపోయింది!''

''అయితే ఇల్లలా నాశనం కావడానికి ఆయన కాదా కారణం!?''


''కాదు లోకంలో ఎవరి స్వభావాన్నిబట్టి వాళ్ళు పోతుంటారు. తల్లిదండ్రుల ప్రవర్తనవల్ల పిల్లలు ప్రభావితం అవుతారనే మాట కొంతవరకూ నిజమే అయినా పూర్తిగా మాత్రం కాదు. నీకు జీవించడం చేతకాక, నీ జీవితం ఇలా అయిపోవడానికి నీ తండ్రే కారణంగా భావిస్తున్నావ్. కానీ నీ స్వభావమే నీ బతుకునిలా నరకం చేసింది. గతం గురించి బాధపడి, బాధపడి వర్తమానంలో కృంగిపోయావు. భవిష్యత్‌మీద ఆశ వున్నా ప్రకమమైన ఆలోచనా శక్తి లోపించడంవల్ల జీవితంలో ఘోరంగా దెబ్బతిన్నావు. నువ్వు బతకాలన్నా బతకలేవు. బతికినా నువ్వు సుఖపడలేవు. నీలాంటివాళ్ళు బతికినా చచ్చినట్లే. ఈ పరిస్థితుల్లో నీకు చావే ఒక వరం''

''అంతేనా...!?''

''అంతే... ముమ్మాటికీ అంతే... నీకు చావే ఒక వరం''

''అయితే లోకంలో నావంటి వాళ్ళు చాలామంది ఉంటారు కదా... వాళ్ళందరికీ చావే పరిష్కారమా!''

''కాదు... పేదరికంలో మగ్గిపోతూ కూడా చదువుకుని పైకివచ్చినవాళ్ళు, గొప్పవాళ్ళయి చరిత్రలో వాసికెక్కిన వాళ్ళు, ఆత్మవిశ్వాసంతో అఖండ విజయాలు సాధించిన వాళ్ళు ఎంతోమంది ఉన్నారు. ఎవరైనా అటువంటి వాళ్ళని ఆదర్శంగా తీసుకుని ముందుకు పోవాలనుకుంటారే కాని నీవంటి



# ప(పె)న్ను

రచయిత, నటుడు 'ఖాదర్‌ఖాన్'ని అరెస్టు చెయ్యమని వారెంట్ ఇష్యూ చేశారని ఆ మధ్య పేపర్లో వార్త వచ్చింది.

బహుశా 'ఆదాయపు పన్ను' కట్టి ఉండదు... టాక్స్ ప్రాబ్లమ్ అని అనుకున్నారు చాలామంది.

నిజం అది కాదు.

సమస్య 'పన్ను' కాదు 'పెన్ను'.

ఓ సినిమా (సారీ. పేరు అడక్కండి)కి అతడు రాసిన అసభ్యపు అభ్యంతరకర సంభాషణలే... అరెస్టు వారెంట్‌కి అసలు కారణం.

—వి.జగదీష్

అభాగ్యుడి రంగూ, రుచీ, వాసనా లేని జీవనాన్ని ఎవ్వరూ స్మరించరు. నీలాగా ఎవ్వరూ బ్రతుకుని నాశనం చేసుకోరు...''


''అయితే నాకూ బ్రతకాలని వుంది. గతాన్ని మరిచిపోయి వర్తమానంలో హాయిగా జీవించాలని వుంది. బ్రతుకులోని తీపిని అనుభవించాలని వుంది...''

''లాభం లేదు... చాలా ఆలస్యం అయిపోయింది. నీవిక బతికే అవకాశం లేదు''

''అమ్మా!'' అని కెవ్వున అరిచాడు పూర్ణ. మళ్ళీ విపరీతమైన నొప్పి మొదలైంది

అంతరాత్మ ఎగతాళిగా నవ్వింది. అంత బాధలోను ఎందుకో అతనికి నవ్వొచ్చింది. భరింపనలవికాని బాధామయ జీవితంనుండి బయటపడబోతున్నందుకు కాబోలు ఆ విషాద హాసం!

*



డిజైన్ : శారద (జనగాం)